# నీదయ.... రాదా?

ఆ రోజు తప్పతాగి వాగిన వాగుడు తరతరాల- కాదు... యుగయుగాల అపఖ్యాతి కారణమయింది వాడికి-

దేశం అందరికి తల్లిలాంటి జానకమ్మని రాములోరు వాడివల్లే అడవులకి పంపేశారు.

ఆ మాట వినగానే నిలువెల్లా వణికిపోయాడు వాడు-

ఆ మాట వినగానే తన భార్య రామ్ రామ్ చెప్పేసి వెళ్లిపోయింది! తను చేసిన పాపానికి ఆ శాస్తి జరగాల్సిందే అనుకున్నాడు.

ఆత్మహత్య చేసుకుని చచ్చిపోవాలని ఉంది వాడికి.

పోయేముందు ఒకసారి రాముడి పాదాలు పట్టుకుని భోరుమని ఏడవాలని ఉంది.

తనలాంటి వదరుబోతుని బర బర సభకి లాక్కెళ్లి మరణ దండన శిక్ష విధించాలి. కానీ ఆ మహాప్రభువు పిలుపు రాలేదు.

దానికోసం ఎదురు చూస్తున్నాడు.

రాజ్యం అంతా తిరుగుతూ 'ఆ తల్లి మన మహారాణి... మీద నింద వేసింది నేనే...' అంటూ ఉండుండి వెక్కెక్కి ఏడుస్తున్నాడు.

జనం గుంపులు గుంపులుగా వున్న చోట మధ్యకెళ్లి "ఇంతమంది ఉన్నారే.. ఏ ఒక్కడికైనా నాలాంటి పాపిష్టివాణ్ని మహారాజా వారి దగ్గరికి తీసుకెళ్లాలనిపించట్లేదా- మీ అంతట మీకే నరికి పోగులెట్టాలని

అనిపించట్లేదా" అని పిచ్చెక్కినట్లు కల దిరుగుతున్నాడు.

వారం రోజులుగా వాడికి తిండీ తిప్పలూ లేవు.

రహదారుల్లో రాజమార్గాల్లో స్త్రీలు కనపడగానే అల్లంత దూరంనుంచి సాగిలపడిపోయి– "సీతమ్మ తల్లీ నేను తప్పు చేశాను" అంటూ ఏడుస్తున్నాడు.

ఒక పిచ్చివాణ్ని చూసినట్లు ఆడంగులు వణికి పారిపోతున్నారు.

రామాజ్ఞ కాలేదని నగర ప్రజలు ఉపేక్షిస్తున్నారుగానీ నిజానికి వాణ్ని నరికి పోగులు పెట్టాలని అందరూ అనుకుంటున్నారు.

రాత్రీ పగలూ ఎండా వానా ఏమీ అతను లెక్కచెయ్యట్లేదు. జవాబులు చెప్పాల్సిన ప్రజలు మౌనం వహించి వెళ్లిపోతున్నాక చెట్టుమీద పిట్టకి– చెట్టు కింద కుక్కకీ అవీ పారిపోతుంటే కొండకీ గుట్టకీ రాయికీ రప్పకీ తన పాపాన్ని చెప్పుకుని రోదిస్తున్నాడువాడు.

కళ్లలో నీళ్లు ఇంకిపోతున్నాయి. కాళ్లు సత్తువ కోల్పోతున్నాయి.

గొంతు శక్తి గొణుగుడులోకి దిగిపోతోంది.

వాడు పిచ్చివాడైపోతున్నాడు.

నీలాకాశంలోకి... నీలాల సరయూనదిలోకి జీవంలేని కళ్లతో చూస్తూ రామా! నీలమేఘశ్యామా...! నేను కీడు చేశాను– దండించవయ్యా.... క్షమించి చంపెయ్యవయ్యా! దరి చేర్చుకుని దండన విధించవయ్యా.. దయచూపి నా తల ఖండించవయ్యా...! రామయ్యా....

గుండె చప్పుళ్లలో రామనామ స్మరణ చేస్తూ 'నీ దయ రాదా' అని గొంతులేని గోడుని.. పంచభూతాల్లోనూ రాముడికి పంపిస్తున్నాడు.

వాడిలో ఒక మహా భక్తుడు రూపు దాలుస్తున్నాడు.

పశ్చాత్తాపంలో పరమభక్తుడు ఆవిర్భవించాడు.

అంతలో.. అంత చీకట్లో ఎవరివో అడుగుల చప్పుడు.

రాముడి మీదే ధ్యాసవున్న వాడికి - రాముడే నడిచి వచ్చాడన్న ఆశ కలిగింది. ఓపిక కూడదీసుకుని... మోకరిల్లాడు.

"రామయ తండ్రీ, వచ్చావా, మీ జంటని విడగొట్టిన పాపాత్ముణ్ని శిక్షించడానికి వచ్చావా? చంపెయ్ నీ బాణంతో నాకు ముక్తిని.. కాదు... విముక్తిని ఇయ్యి రామభద్రా!" అన్నాడు.

అతన్ని లేవనెత్తి "నేను రామభద్రుణ్ని కాదు. వేగు భద్రుణ్ని" అన్నాడు వచ్చిన వ్యక్తి.

అంతే.. వాడిలో వెయ్యేనుగుల బలం ఆవహించింది.

వేగుభద్రుడి మీద ఆగ్రహం అతనికి అనంతమైన శక్తినిచ్చింది- వేగుభద్రుడి పీక పట్టుకున్నాడు-

"నువ్వే.. నువ్వే.. నా తల్లి సీతమ్మనీ, నా తండ్రి రామయ్యనీ విడగొట్టిన పాపాత్ముడివి. ఒక తాగుబోతు ప్రేలాపనని రాముడులాంటి ధర్మ స్వరూపుడికి చెప్పావు- ఆయన భార్యని విడిచిపెట్టేయడానికి కారకుడవు అయ్యావు. ఈ తప్పులో నాది ఎంత భాగం? నీది ఎంత భాగం? రామచంద్ర ప్రభువుది ఎంత భాగం? చెప్పు" అంటూ పీకని పట్టుకుని పట్టుని బిగించాడు.

పీకపట్టు వదిలేసి మళ్లీ ఏడిచాడు.

"నేను తెలివితేటలు లేనివాణ్ని తాగుబోతుని... నువ్ తెలివితోనే ఉద్యోగం చేస్తున్న గూఢాచారివి.. మనిద్దరివల్ల ఏం జరిగింది?" కుప్పకూలిపోయి కుమిలిపోయాడు.

వేగుభద్రుడి నోటి నుండి చాలాసేపు మాటరాలేదు.

వాడిమీద ఉన్న అసహ్యం- కోపం- అన్నీ పోయి జాలి కలిగింది. ఇప్పుడు.. అతని మీద గౌరవం కలిగింది.

"ఒరే.. నాకు నీయంత ప్రాజ్ఞత లేదురా.. చాకలికులంలో పుట్టావు

గనక నా మనస్సుని ఉతికి ఆరేశావు- నిన్ను గత వారంగా గమనిస్తూనే వున్నాను. నాకు నీ మీద గౌరవం కలిగింది" అన్నాడు వేగుభద్రుడు.

"నాకు గౌరవాలొద్దు శిక్ష కావాలి. రామరాజుగారి దర్శనం ఇప్పించు. ఆయన కాళ్లు పట్టుకుని మరణ శిక్ష వేడుకోవాలి. తమరు వేగులు. వీధి వీధి తిరిగి ధర్మస్థాపన చెయ్యడానికి రామచంద్రులకి సహకరిస్తారుగా- ఈ అభాగ్యుడి కథ చెప్పండి! నన్ను వారి వద్దకు చేర్చండి" అన్నాడు.

వేగుభద్రుడి కళ్లలో నీళ్లు పొంగాయి.

"నేను ఇప్పుడే నీ వ్యథ చెప్తాను" అన్నాడు తడిలో పొడిగా.

✦ ✦ ✦

వేగుభద్రుడి మాటని రామభద్రుడు విన్నాడు.

"భద్రా! నాకు రాజధర్మాన్ని గుర్తు చేసిన తిప్పడు అంటే వాల్మికి మహర్షి మీద ఉన్నంత గౌరవం ఉంది- ఇద్దరూ నన్ను... మనిషి నుంచి మనీషిగా నిలబెట్టిన వారే" అన్నాడు రాజారాముడు.

✦ ✦ ✦

ఓ చీకటిలో చెట్టుకింద రామస్మరణతో మూల్గుతున్న తిప్పడి- కళ్లు మూతలు పడిపోయాయి.

నీలిరంగు కాంతులు- నీలాకాశం మెరుపులు ప్రజ్వలించాయి.

అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతున్నాయి.

ఆదర్శదంపతులైన ఆలుమగల మధ్య వియోగం కలిగించిన పాపాత్ముడి పాపం ప్రక్షాళనమై వైకుంఠయానం చేస్తున్నాడు.

అతడి భౌతిక శరీరం భూమిలో కలిసింది- సీతమ్మ తల్లి కాళ్లు పట్టుకోవాలని...